# షాక్ ట్రీట్‌మెంట్

డా.కొదాలి వాణీ చలపతిరావు

సాయంత్రం ఐదు గంటలు కావడం ఆలస్యం నా కాళ్లు ఆఫీసు నుంచి ఇంటికి పరుగులు తీస్తాయి. నేనలా పరుగులు పెట్టడానికి కారణం- మా ఇంటికి సెంట్రల్ ఎట్రాక్షన్ అయిన మా అమ్మాయి, ముద్దులు మూటగట్టే మూడేళ్ల శ్వేత నా కోసం గుమ్మంలో ఎదురుచూస్తూ కూర్చుని ఉంటుంది గనుక!

పొద్దుననగా వదిలేసి వెళ్తానేమో సాయంత్రం అయ్యేసరికి నన్ను చూడటానికి తను, తనని చూడటానికి నేను తెగ తపించిపోతూ ఉంటాం.

వడివడిగా నా అడుగులు ముందుకు పడుతున్నాయి. 'ఇంకో పది నిముషాలు నడిస్తే ఇంటికి చేరుకుంటాను' అనుకుంటూ ఉండగా నా హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి సెల్ మోగుతున్న శబ్దం వినిపించింది.

'అబ్బ! ఈ సెల్‌కి ఓ వేళాపాళా ఓ సమయం, సందర్భం లేవు' అని విసుక్కుంటూ సెల్ బయటికి తీసి చెవి దగ్గర పెట్టుకుని 'హలో..' అన్నాను.

అవతలి నుంచి వెంటనే సమాధానం రాలేదు.

కొంతసేపటికి "హలో! పరిమళ అంటే నువ్వేనా?" అంటూ వినిపించింది.

పరిచయం ఉన్న గొంతు కాదది! ఎవరిదో కొత్త గొంతు! స్వపరిచయం, ఇవతలి ఫోన్ నెంబర్ అడగటం వంటివేమీ లేకుండా తలా తోకా లేని సంభాషణ ప్రారంభిస్తున్న రఫ్‌గా ఉన్న ఆ ఆడగొంతు, ఆ సంబోధన నన్ను ఆశ్చర్యపరిచాయి.

"ఎవరు మీరు?" అన్నాను మార్దవంగా.

"నా పేరు ఊరు నీకు అనవసరం. మీ ఆఫీసులో రాజశేఖరం అనే ఆయన పనిచేస్తాడు చూడు. ఆయన పెళ్లాన్ని నేను! అవునూ.. ఏంటి సంగతి మా ఆయనతో నువ్వు రాసుకుని పూసుకుని తిరుగుతున్నావట ఆఫీసులో! వళ్లు దగ్గర పెట్టుకుని జాగ్రత్తగా ఉండు. కోపం వచ్చిందంటే నేనసలే మనిషిని కాను. దేశంలో ఇంత మంది మగాళ్లుండగా నా మొగుడే దొరికాడా నీకు?" అంటూ అరుస్తోంది ఆవిడ!

అనుకోని ఆ పిడుగుపాటుకు హడలిపోయాను నేను.

"ఛ! ఛ! ఏం మాట్లాడుతున్నారు మీరు? అంత మంచి మనిషి అయిన రాజశేఖరంగారి భార్య అయి ఉండి మీరు ఇలా మాట్లాడటం..."

"అంత నచ్చేశాడా నా మొగుడు నీకు! అందుకేనా వదిలిపెట్టలేకపోతున్నావ్?"

"మీరు చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు. నన్ను అవమానిస్తున్నారు. నేనూ పెళ్లయి సంసారం చేసుకుంటున్న ఆడదాన్ని. ఓ పాపకు తల్లిని! ఆఫీసులో నాకో హోదా, గౌరవం ఉన్నాయి. ఉద్యోగం చేసే ఆడవాళ్లంటే మీలో చులకన భావం ఉన్నట్టుంది. మరోసారి ఎప్పుడూ ఇలా ఫోన్ చేసి అమర్యాదగా మాట్లాడకండి" అంటూ ఇంక సంభాషణ పొడిగించటం ఇష్టం లేక లైను కట్ చేశాను.

మళ్లీ రింగ్ అయినా నేను ఎత్తలేదు. అప్పటికే నా నవనాడులూ కుంగిపోయాయి. మెదడు మొద్దుబారిపోయినట్లయింది.

ఇంటికి ఎలా చేరుకున్నానో నాకే తెలియదు.

వస్తూనే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మంచం మీద పడిపోయాను. 'అమ్మా' అంటూ పరుగున వచ్చి నా కాళ్లను చుట్టేసిన పాపను పనిపిల్లకు వప్పచెప్పి "బయటికి తీసుకెళ్లి ఆడించు" అని చెప్పాను.

"ఏంటమ్మా అలా ఉన్నావ్?" అని పనిపిల్ల నా ముఖం వంక చూస్తూ ప్రశ్నించినా సమాధానం ఇవ్వలేదు.

ప్రపంచ అంతా గిర్రున తిరిగిపోతున్నట్టు నేను తలకిందులైపోతున్నట్టు 'ఎలాగో' అనిపించింది. 'ఇది' అని చెప్పలేని బాధ.

భూమి నడిమధ్యకు చీలిపోయి అందులో నేను కూరుకునిపోతున్నంత అవమానం కలుగుతోంది.

జీవితంలో ఎప్పుడూ ఇలాంటి బాధ కలుగలేదు.

ఇంతటి అవమానాన్ని ఏనాడూ అనుభవించలేదు.

గుండె బరువైపోతోంది.

అంత బాధలోనూ రాజశేఖరంగారు నా కళ్ల ముందు మెదిలారు. మా బాస్ ఆయన! మంచి మనిషి. ఆఫీసర్‌ని అన్న అహం, దర్పం లేకుండా అందరితో 'నేనూ మీలో ఒకడ్ని' అన్నట్టుగా సింపుల్‌గా ఉంటారు. సోషల్‌గా మాట్లాడతారు. తన బ్రాంచిలో పనిచేసే ఆడవాళ్లంటే ఆయనకు అపరిమితమైన గౌరవం. అందరి ఇబ్బందులు.. బాధలు అర్థం చేసుకుంటారు.

ఆయనకు నేనంటే ప్రత్యేకమైన అభిమానం.

కారణం- ఆయన ఆఫీసు బాధ్యతల్లో ఎక్కువ శాతం నేను పాల్పంచుకుంటూ ఉంటాను.

నా తెలివి తేటల మీద, అవలీలగా ఆఫీసు పనులు నిర్వహించే నాలోని నైపుణ్యం మీదా ఆయనకు బోలెడు నమ్మకం!

'ఈ బ్రాంచికి నువ్వో ఎసెట్‌వమ్మా' అంటారు ఎప్పుడూ!

'నా కుడిభుజం' అని అందరికీ పరిచయం చేస్తారు.

అంతమాత్రాన ఆయనకూ నాకూ సంబంధం అంటగడుతుందా ఆ మహా ఇల్లాలు?

'అందంగా ఉండటం నా తప్పా? చదువుకుని ఉద్యోగం చేయటం నా తప్పా? తెలివితేటలతో, చాకచక్యంతో ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ కెరీర్‌ను డెవలప్ చేసుకోవటం నేను చేసిన పెద్ద నేరమా? ఏం తప్పు చేశానని నన్నిలా ఆవిడ ఫోన్‌లో పట్టుకుని నానా మాటలూ అంటోంది?' అని ఆలోచిస్తుంటే నాలో ఏడుపు తన్నుకుని బయటికొచ్చి బావురుమని ఏడ్చేశాను.

రాజశేఖరంగారు నాకు గురువులాంటి వారు. ఆయన దగ్గర నేను ఆఫీసు ఎడ్మినిస్ట్రేషను ప్రత్యక్షంగా, పరోక్షంగా నేర్చుకున్నాను. మామూలుగా ఉన్నప్పుడు లేడీ స్టాఫ్‌తో ఆయన ఎంత సరదాగా ఉండేవారో ఆఫీసర్ సీటులో కూర్చుని క్రింది ఉద్యోగులతో పనిచేయిస్తున్నప్పుడు అంత స్ట్రిక్ట్‌గా, ఖచ్చితంగా ఉండేవారు. ఆయన శిక్షణలో నాకు ఆఫీసు పనే కాదు నా పర్సనాలిటీ కూడా డెవలప్ అవుతున్న భావన కలిగేది నన్ను నేను ఎనలైజ్ చేసుకుంటే! ఆయనకు మా నాన్నగారి వయసుంటుందేమో నన్ను ఒక్కోసారి 'అమ్మాయ్..' అంటూ సంబోధించేవారు.

సీరియస్‌గా ఆఫీసు పని చేసుకుంటున్నప్పుడు మాత్రం "మిసెస్ పరిమళా!" అని సంబోధించేవారు. ఎప్పుడూ లేనిది ఒక రోజు ఏ మూడ్‌లో ఉన్నారో ఏమో 'న్యూ ఇయర్ గిఫ్ట్' అంటూ ఓ చీర నా చేతిలో పెట్టి "మా అమ్మాయికి కొంటూ" అంటూ ముక్తాయింపు ఇచ్చారు. అది తీసుకొని పెద్దపొరపాటు చేస్తున్నానని, అది ఒక అనాలోచిత చర్య అనీ అప్పుడు నాకు తెలియలేదు. మా అమ్మ ఎప్పుడూ అంటూ ఉండేది... 'పరాయి మగవాళ్లకు దూరంగా ఉండాలని, వాళ్లు ఏ బహుమానాలు ఇచ్చినా తీసుకోకూడదని' ఆ సమయంలో ఆ

మాటలు గుర్తొచ్చినా బాగుండేది. అయినా నాకెందుకో రాజశేఖరంగారు ఎప్పుడూ పరాయివాడిగా, నన్ను చెడు దృష్టితో చూస్తున్న మగవాడిగా ఎప్పుడూ అనిపించలేదు. అలా అనిపించి ఉంటే అసలు తీసుకుని ఉండేదాన్ని కాదు.

ఎప్పుడో తెలియక చేసిన చిన్న పొరపాటు ఇప్పుడు నా పాలిట శాపమై ఆయన భార్య నోట శాపనార్థాలు పెట్టిస్తుందని ఆ మర్నాడు నా సెల్‌లో మరో కాల్ వచ్చే వరకూ నాకు ఏమాత్రం ఆలోచనకు రాలేదు. "ఏయ్ పరిమళా! మా ఆయన న్యూ ఇయర్ గిఫ్ట్‌గా నీకు చీర కొనిపెట్టాడటగా. ఇంకా ఏమేం రాబట్టావేం మా ఆయన్ని పట్టేసి? నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా? ఆయన ఎక్కడ ఏం చేసినా నాకు అన్నీ తెలిసిపోతాయి" అంటూ ఇంకా ఏదేదో మాట్లాడసాగింది.

"ప్లీజ్! మీకు పుణ్యముంటుంది. ఇలా మాటిమాటికీ ఫోన్ చేసి నన్ను డిస్టర్బ్ చేయకండి"

"నువ్వు నా జీవితాన్ని డిస్టర్బ్ చేయలేదా దానికేమంటావే?"

"చూడండి.. నేను 'మీరు' అని మిమ్మల్ని సంబోధిస్తున్నాను. మీరు నన్ను నువ్వు అని మాట్లాడుతున్నారు"

"నీకేంటి రెస్పెక్ట్ ఇచ్చేది. నీలాంటి వాళ్లకు గౌరవం కూడా ఇచ్చి మాట్లాడాలా? నువ్వు నా మొగుడ్ని..."

"మేడమ్, ఆఖరిసారి మర్యాదగా చెబుతున్నాను. మీరు నా జోలికి రావద్దు. మీరు అనుమానం మనిషయితే మీ సందేహాలు, సాధింపులు, కోపతాపాలు అన్నీ మీ వారి దగ్గర చూపించుకోండి. ఏదయినా అడగదలుచుకుంటే ఆయన్ని అడగండి. నన్ను కాదు. నేను చదువు, సంస్కారం, సమాజంలో ఓ హోదా, గౌరవం ఉన్న స్త్రీని. మీ సంకుచిత మనస్తత్వంతో దయచేసి నన్ను అల్లరి పెట్టకండి" అని నేను ఎంత చెబుతున్నా ఆమె అసలు నా మాటలు వినిపించుకునేలా లేదు.

నన్నసలు మాటాలడనిస్తేనా? గులకరాళ్ల దబ్బాలా తన ధోరణే తనది. అభాండాలు, అపనిందలు, పరుషమైన మాటలు ఒకదాని వెంట ఒకటిగా వచ్చి శరాఘాతాల్లా నన్ను తాకుతున్నాయి.

"నా సంగతి నీకు తెలియదు. నీ సంసారంలో నిప్పులు పోస్తాను. మా ఆయన్ని వదలకుంటే నలుగురి ముందూ పంచాయతీ పెడతాను" అంటూ బావురుకప్పలా అరవడం మొదలుపెట్టింది.


నాకు విసుగొచ్చేసింది.

నాలో సహనం చచ్చిపోయింది.

అందుకే లైన్ కట్ చేశాను.

మరోసారి ఎప్పుడూ ఆమె దగ్గరి నుంచి ఫోన్ వస్తే అసలు ఎత్తకూడదని ఆ సంఘటనతో గట్టి నిర్ణయానికి వచ్చాను.

అంతే కాదు... ఈసారి మళ్లీ ఆవిడ నా జోలికి వస్తే విషయం రాజశేఖరం గారికి కూడా చెప్పేయాలని నిర్ణయించుకున్నాను. అసలు ఈరోజే చెప్పసేదాన్ని. కానీ 'ఆమెకు ఇంగితం లేకుంటే నాకయినా ఉండొద్దా' అన్న ఆలోచన నా మనసులోకి రాకుంటే!



మొగుడ్ని అనుమానించే పెళ్లాలు ఈ లోకంలో చాలా మంది ఉండొచ్చు. కానీ అది వాళ్లిద్దరి మధ్యనే ఉండాలి గానీ ఇలా వీధికెక్కి సాటి స్త్రీలను నిలదీసి అడగటమేంటి? నన్ను అల్లరిపాలు చేయాలన్నంత కచ్చి ఆ రాజశేఖరం గారి భార్యకు ఎందుకు? తన దారిన తను పోయే వాళ్లను రోడ్డు పక్కన పడి ఉన్న ముళ్ల కంచె కొంగుకు తగులుకొని వెంట వచ్చినట్టు అన్నెంపున్నెం తెలియని నాకు ఈ న్యూసెన్స్ ఏంటి? అనుకున్నాను చిరాగ్గా. ఉత్తి పుణ్యానికి తనను అనుమానించి ఎవరయినా వేలెత్తి చూపుతుంటే, తన శీలాన్ని శంకిస్తుంటే స్త్రీకి అంతకన్నా అవమానం, బాధ ఇంకేముంటాయి?

ooo

ఆరోజు-

ఆఫీసు నుంచి వస్తూనే మా వారు ఎందుకో చాలా హుషారుగా కనిపించారు. శ్వేతను ఎత్తుకుని ముద్దులాడారు. కిచెన్‌లో నా వెనకాలే తిరుగుతూ ఏవేవో జోక్స్ వేశారు. నేను మాత్రం మౌనంగా నా పనులు నేను చేసుకుంటూ ఉండిపోయాను. మనసు నిప్పుల కుంపటిలా ఉంటే ఆయన జోక్స్‌కు నవ్వెలా వస్తుంది నాకు?

"ఏంటి అలా ఉన్నావ్?" అన్నారు.

"ఏం లేదు" అని క్లుప్తంగా సమాధానం ఇచ్చాను.

"బయటికి వెళ్దామా?" అన్నారు.

"నేను రాను. మీరు వెళ్లండి" అన్నాను. ముసిముసి నవ్వులు నవ్వారు ఎందుకనో!

ఆ రాత్రి బెడ్ మీదికి చేరాకా అంతే. రొమాంటిక్ మూడ్‌లో కనిపించారు. నన్నూ ఆ మూడ్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం

చేస్తే కసిరికొట్టాను.

చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలా మనసంతా చిరాకుగా, కోపంగా, ఉక్రోషంగా ఉంది. అందుకే అటు తిరిగి పడుకున్నాను. ఉన్నట్టుండి నా వెనుక నుంచి,

"ఆ రాజశేఖరంగారి భార్య ఫోన్‌కాల్‌ని అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందా?" అన్న మాటలు ఆయన నోటి నుంచి నేనేమాత్రం ఊహించని విధంగా రావటంతో దిగ్గున లేచి మంచం మీద కూర్చున్నాను.

ఆయన ముఖంలోకి పరిశీలనగా చూశాను.

ఎప్పటిలా ఆయన ముఖంలో అదే చిరునవ్వు!

ఆ కళ్లల్లో అవే చిలిపి చూపులు!

"ఆమె... ఆమె మీకూ ఫోన్ చేసిందా?" అన్నాను ఎగిరెగిరి పడుతున్న గుండెతో.

"చేసింది. అయితే ఏంటట? ఈ చెవితో విని ఈ చెవితో వదిలేశాను. 'నా భార్య ఎలాంటిదో నాకు తెల్సు. ఎవరో దారినపోయే దానమ్మ చెబితే తెల్సుకోవాల్సిన దుస్థితిలో నేను లేను. నా పెళ్లాం గురించి చెప్పే ముందు, ఇలా ఫోన్లు చేసి ఇతరుల సంసారాల్లో అలజడి సృష్టించాలనుకుంటున్న మీ సంస్కార హీనత ఎలాంటిదో అది ముందు తెలుసుకోండి' అన్నాను"

"ఆమె ఏం మాట్లాడింది. మీతోనయినా మర్యాదగా మాట్లాడిందా. నా మీద ఏమేం కల్పించి చెప్పింది? అవన్నీ నిజమని మీరు నమ్మలేదు కదా" నరాలు తెగిపోయే టెన్షను, గుండెబద్దలయ్యే ఉద్వేగంతో ఆవేశంగా ఆయన్ని అడిగాను.

"నన్ను గురించి ఏమనుకుంటున్నావు నువ్వు? నాకంటూ ఒక ఆలోచన, విచక్షణాజ్ఞానం, వ్యక్తిత్వం లేనివాడిలా ఎవరెలా చెబితే అలా ఊగే డీలా మనిషిలా కనిపిస్తున్నానా? ఇరవైమంది మగస్టాఫ్‌కి, పదిహేను మంది లేడీస్టాఫ్‌కి బాస్‌ని! ఆఫీసులో ఒకరితో ఒకరికి ఎలా అవసరం పడుతుందో, ఎలా కలిసిమెలిసి పనిచేయాల్సి వస్తుందో తెలియకుండానే ఎగ్జిక్యూటివ్ పోస్ట్ వెలగపెడుతున్నాననుకుంటున్నావా? అయినా నమ్మకం అనే పునాది మీదనే వివాహ బంధం అనే సౌధం పటిష్టంగా నిలబడి ఉండేది. అది నా మనసులో పుష్కలంగా ఉండగా నిన్ను తప్పు పట్టే కుసంస్కారానికి అందులో చోటెక్కడిది?" అన్నారు నిండుకుండలా చెదరని గాంభీర్యంతో. ఆ మాటలు నాకెంతో రిలీఫ్‌నిచ్చాయి.

నా మనసులోని బాధనంతా మా వారు చెయ్యి పెట్టి తీసేసినంత హాయి కలిగింది.

కొండంత అండలా ఆయన పక్కన కనిపిస్తుంటే ఇక ఈ ప్రపంచం మొత్తం ఒకటై దండెత్తి వచ్చినా పోరాడి గెలవగలనన్న ధీమా నాలో కలిగింది.

"థాంక్యూ.. థాంక్యూ వెరీమచ్!" అన్నాను కృతజ్ఞతగా ఆయన చేతిని నా చేతిలోకి తీసుకుని స్పృశిస్తూ.

"అకస్మాత్తుగా మబ్బులేని ఉరుములా ముక్కూ ముఖం తెలియని ఆవిడ ఎవరో 'నేను రాజశేఖరంగారి భార్యనంటూ' ఫోన్ చేసి నిన్నూ, నన్నూ కలిపి కడిగేస్తుంటే మొదట నాకు వళ్లు మండి నేనూ కోపంగా రియాక్ట్ అయ్యాను. ఆ తరువాత 'పాపం' అనుకున్నాను జాలిగా" అన్నారు ఆయన.

"జాలా? ఆవిడ మీదా?" ఆశ్చర్యపోయాను నేను.

"చూడు పరిమళా! చదువు సంస్కారాన్ని నేర్పుతుంది. ఉద్యోగ బాధ్యతలు ఊపిరి సలపని పనితో మరో విషయం వైపు దృష్టిని, మనసును మళ్లనివ్వవు. ఆ రెండూ లేకపోబట్టే కదా పాపం ఆవిడ నిరంతరం మొగుడికి కాపలా కాస్తూ తనకూ మనశ్శాంతి లేక ఇంట్లో ఆ రాజశేఖరంగారినీ మనశ్శాంతిగా బతకనివ్వక, నీ బోటి నా బోటి వాళ్లకూ ఫోన్లు చేసి మనశ్శాంతిని కరువు చేస్తోంది. 'ఆడవాళ్లకు చదువులెందుకు, ఉద్యోగాలు చేయటానికా, ఊళ్లేలటానికా' అంటారు కానీ చదువుకోని ఓ ఆడదాని వల్ల సంసారానికి, ఈ సమాజానికి ఎంత నష్టమో ఇలాంటి వాళ్లను చూస్తేనే ప్రాక్టికల్‌గా తెలిసి వస్తుంది" అన్నారు మా వారు.

నాకు జరిగిన అవమానం నా కోపం, నా చిరాకు వీటి గురించి తప్ప ఇంతవరకూ ఆ మార్గంలో నేను ఆలోచించలేదేమో ఆశ్చర్యంతో మంత్రముగ్ధలా ఆయన మాటలు వింటూండిపోయాను.

'ఈ విశ్లేషణ నాకెందుకు కలగలేదు?' అనిపించింది ఆ తర్వాత! మా వారు ఇంకా మాట్లాడుతుంటే మౌనంగా వింటూండిపోయాను.

"ఆవిడ ఎడాపెడా నన్ను దులిపేసి ఫోన్ పెట్టేయగానే నేను వెంటనే రాజశేఖరంగారికి డయల్ చేశాను. ఆయనతో కాసేపు మాట్లాడాక ఆయన సంసార స్థితి ఏంటో తెలిసిపోయాక ఆయన మీదా విపరీతమైన జాలి కలిగింది నాకు! ఆవిడ ఒక్క నీ విషయంలోనే కాదు అందరి ఆడవాళ్ల విషయంలోనూ ఆయన్ని అలాగే పీక్కుతింటుందట. 'అలాకాదు ఇలా' అని ఏదయినా సముదాయించి చెప్పే అవకాశం కూడా ఇవ్వకుండా బావురుకప్పలా బానంత నోరు పెట్టుకుని అరుస్తుందట. అరుపులు, కేకలు తప్ప ఆలోచన, విచక్షణ అనేవే ఆమె దగ్గర మచ్చుకైనా కనిపించవట. ఆవిడ మూలంగా తన జీవితమే కాక పిల్లల జీవితమూ పాడైపోతోందని చాలా బాధపడ్డాడు ఆయన. తను ఎక్కడుందీ, ఏం చేస్తోందీ... ఆ రోజు ఆఫీసుకు వెళ్లిందీ లేనిదీ అన్నీ తెలుసుకోవటానికి పిల్లలను గూఢచారులుగా నియమిస్తుందట. దాంతో వాళ్లూ అలాగే తయారై అత్యుత్సాహంతో తల్లికి తండ్రి మీద చాడీలు చెపుతుంటారట. కన్నతల్లే వాళ్ల భవిష్యత్తును బండలు చేస్తుంటే ఇక వాళ్ల జీవితాలను ఆ భగవంతుడయినా కాపాడగలడేమో ఒక్కసారి ఆలోచించు!" అన్నారు ఆయన.

నా మనసు తీవ్రంగా ఆలోచిస్తుండగా మళ్లీ ఆయనే అన్నారు.

"కొన్ని సంసారాలంతే! భార్య, భర్త ఇద్దరిలో ఎవరు అజ్ఞానులైనా, మూర్ఖులైనా తిరిగి సంస్కరిద్దామన్నా చేతికి రానంతగా కుటుంబాలు పాడయిపోతాయి. దుర్మార్గుల కన్నా అజ్ఞానులు, మూర్ఖులే ఈ సమాజానికి మరింత ప్రమాదకరం!"

ఆ మాటలంటున్నప్పుడు ఆయన మనసులోని తపన నా కంటికి స్పష్టంగా కనిపించింది.

నామీద వచ్చిన అపనింద, నాకు జరిగిన అవమానం, ఎదురుకాబోయే ఫలితాల గురించిన చింత... అంతకు మించి నా మనసు ఇంత దూరం ఆలోచించనందుకు నిజంగా ఆయన ముందు నేను సిగ్గుపడిపో



## కూతురు పుట్టింది

గత ఏడాది సెప్టెంబర్‌లో పెళ్లి చేసుకున్న సూర్య-జ్యోతికలు ఇప్పుడు తల్లిదండ్రులు కూడా ఐపోయారు. నిన్న ఆగస్టు పదో తేదీన జ్యోతిక ఓ పాపకి జన్మనిచ్చింది. శుక్రవారం నాడు పుట్టింది కాబట్టి మహాలక్ష్మి తమ ఇంట అడుగుపెట్టిందని బోల్డు మురిసిపోతున్నారట సూర్య-జ్యోతికలు. పెళ్లి తర్వాత జ్యోతిక సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది. ఇక సూర్యకి పెళ్లి తర్వాత చెప్పుకోదగిన హిట్టు లేదు. ఇప్పుడు కూతురు పుట్టింది కాబట్టి తండ్రి కెరీర్ మలుపు తిరుగుతుందేమో చూడాలి!

యాను.

రాజశేఖరంగారు గుర్తొచ్చినప్పుడల్లా 'అయ్యో పాపం' అనుకోకుండా ఉండలేకపోయాను. మొదటి ఫోన్ కాల్ వచ్చిన మర్నాడు ఆఫీసుకెళ్లి ఎంత విచిత్రంగా ప్రవర్తించానో ఆ సందర్భంలో గుర్తుకు తెచ్చుకుంటే సిగ్గనిపించింది.

ఆ రోజు ఆఫీసులో ఎవరితో మాట్లాడలేదు. సీరియస్‌గా ముఖం పెట్టి కూర్చున్నాను. రాజశేఖరంగారి సీట్ దగ్గరికి వెళ్లలేదు. రోజుల్లా ఆ రోజు ఎలాంటి సలహాలు, సంప్రదింపులు చేయలేదు. ఒకసారి ఆయనంతట ఆయనే ఎదురుపడ్డా ముఖం పక్కకు తిప్పుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాను. అందరూ 'ఎందుకలా ఉన్నావ్?' అన్నా 'ఏం లేదు' అంటూ విసరుగా సమాధానం చెప్పాను. 'అలా కాకుండా అసలు ఏమీ జరగనట్లు మామూలుగా ఉండి ఉంటే ఎంత బాగుండేది?' అనిపించింది మా వారి మాటల ప్రభావం నా మనసు మీద పనిచేశాక.

ఆ తరువాత కూడా రాజశేఖరంగారి భార్య దగ్గరి నుంచి రెండు మూడు ఫోన్ కాల్స్ వచ్చాయి.

అయినా ఈసారి నేను అదరలేదు బెదరలేదు. ఉలుకూ పలుకూ లేకుండా ఆమె మాటలు విన్నాను. ఒక్కసారి మాత్రం 'చూడండి.. మిసెస్ రాజశేఖరం గారూ ఆడదానికి ఆడదే శత్రువు అని ఎందుకంటారో మీ మాటలు వింటుంటే ఇప్పుడే నాకు అర్థమవుతోంది. దయచేసి ఈ అనవసరపు అనుమానాలతో మీ బుర్ర పాడుచేసుకుని సంసారంలో సుఖశాంతులు కోల్పోకుండా మారుతున్న సమాజాన్ని, ఎదుగుతున్న స్త్రీ లోకాన్ని చూడండి. మీరేం కోల్పోతున్నారో మీకు అర్థమవుతుంది. జీవితంలో ఎంత నష్టపోతున్నారో తెలిసి వస్తుంది' అని ఠక్కున ఫోన్ పెట్టేశాను. నా మాటలు ఆమెకు అర్థమవుతాయని, అకస్మాత్తుగా ఆమె మారిపోతుందనీ కాదుగానీ ఏదో చిరు ప్రయత్నం నా వంతు బాధ్యతగా నేను చేశాను.

ooo

"ఈమధ్య మిసెస్ రాజశేఖరం గారి దగ్గరి నుంచి బహుశ నీకేమి ఫోన్ కాల్స్ రావటం లేదనుకుంటా!" అన్నారు మా వారు చిద్విలాసంగా నవ్వుతూ.

ఒక్క నిముషం ఆలోచించాను నేను! ఆ రోజు ఓ చిన్నపాటి హితబోధను నేను చేశాక కూడా ఆవిడ దగ్గరి నుంచి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. కానీ ఈమధ్య చాలా రోజులయింది మళ్లీ కాల్ రాలేదు. ఆ మాటే మా వారితో అంటే- "ఇంక రావులే. మంత్రం వేశాను" అన్నారు.

"మంత్రమా? ఏంటది? ఏం చేశారేంటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ముల్లును ముల్లుతోనే తీయాలి. పెద్దవి, సూది మందుతో తగ్గనివి అయిన రోగాలకు ఆపరేషనే చేయాలి. అందుకే యుద్ధభూమిలో సైనికుడిలా 'ఆపరేషన్ అనుమానం!' అని పేరు పెట్టి ఆమె మనసులోని అనుమానం, అసూయ అనే అంతఃశత్రువుల మీద యుద్ధం చేశాను" అన్నారు ఏదో కోడ్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతున్నట్టు.

"ఏం చేశారో సరిగా చెప్పండి" అన్నాను ఆరాటం ఆపుకోలేక.

"ఒకరి చేత అనుమానించబడటం కన్నా మించిన వ్యథ, అవమానం ఆడదానికి మరొకటి ఉండవు కదా! కనుక ఆ బాధ ఎలాంటిదో ఒక్కసారి ఆమె అనుభవానికీ తెస్తే మరొకసారి తన భర్తను అనుమానించకుండా, సాటి ఆడవాళ్లను అవమానంచకుండా ఉంటుందనీ ఆ అనుమాన భూతం ఆమె మనసులో నుంచి పూర్తిగా తొలగిపోయి ఆ కాపురం బాగుపడుతుందనీ అనిపించి ఓ ఆపరేషన్‌కు వ్యూహం పన్నాను! ఆమె గురించి క్షుణ్ణంగా ఎంక్వయిరీ చేసి, వాళ్ల పక్కింటి పరాంకుశంగారి భార్య చేస్తున్నట్టుగా ఓ స్టేజి ఆర్టిస్ట్‌తో రాజశేఖరం గారి భార్యకు ఫోన్ చేయించి అచ్చం ఆమె స్టయిల్లోనే ఘాటుగా నాలుగు డైలాగులు రెండు ఇన్‌స్టాల్‌మెంట్ల మీద కొట్టించాను. అంతే! ఆ బాధ అనుభవానికి వచ్చిందేమో మళ్లీ నీ జోలికి రాలేదు. ముందు ముందు ఇంకెవరి జోలికీ రాదు! అన్నెం పున్నెం తెలియని నన్ను పరాంకుశం గారి భార్య అనుమానించినట్టే నేనూ అమాయకులైన సాటి స్త్రీలను ఇన్నాళ్లుగా అనుమానిస్తూ వస్తున్నాను అన్న ఆలోచన ఆమెలో వచ్చే ఉంటుంది. ఆమె జ్ఞాన నేత్రం కొంతయినా తెరుచుకునే ఉంటుంది. ఇదంతా నేను చేసింది ఆమె మీద కక్ష సాధింపుతో కాదు. ఆవిడని కొంతయినా ఉద్ధరించాలని, ఆ సంసారంలో ఉన్న అపోహలు తొలగించి ఆ దంపతులు సుఖంగా, సంతోషంగా ఉండాలని" అన్నారు మా వారు.

ఆ తరువాత ఇంక నేనేమీ మాట్లాడలేదు. ఆయన వంకే చూస్తూ చాలా సేపు అలాగే ఉండిపోయాను. ఉన్నట్టుండి నాకో సందేహం వచ్చింది.

"బాగానే ఉంది కానీ ఆ పరాంకుశంగారి భార్య మీద ఈవిడ కోపం తెచ్చుకుని ఆమెతో గొడవ పెట్టుకుంటే? రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు.."

"ఆ భయం ఏమీ అక్కర్లేదు. ఈవిడ నోటికి, అనుమానం రోగానికి భయపడి ఆ వీధిలోని ఏ కుటుంబాలూ ఆ ఇంటికి రాకపోకలు, మాటలు సాగించవట! అయినా ఇతరుల మీద అపనిందలు వేయటం తేలిక గానీ అదే అపనింద తన మీద వస్తే ఆ షాక్‌కి నోరు, మనసు ఒక్కసారిగా మూగవైపోతాయి. మెదడు ఆలోచించడం మొదలుపెడుతుంది. ఆత్మవిమర్శకు ఆమెను ప్రేరేపిస్తుంది. అంతేగానీ ఇంతకు ముందులా నోరు పారేసుకోనివ్వదు" అన్నారు మా వారు.

నిజమే కాబోలు- అనుకున్నాను సాలోచనగా.

## దేనికైనా టైం రావాలండీ!

బాలీవుడ్‌లో ఇంతదాకా సమీరా రెడ్డి తనదైన హిట్టు లేదు, కానీ అవకాశాలు మాత్రం వస్తూనే వున్నాయి. ఈ విషయమై సమీరా ఏమంటుందంటే- 'అభిషేక్, సైఫ్ అలీఖాన్ లాంటి హీరోలు కూడా మొదట్లో హిట్లు లేక అవస్థలు పడ్డారు. మరిప్పుడు చూడండి, వాళ్లని కాదన్న నిర్మాతలే ఇప్పుడు వాళ్లతో సినిమాలు తీస్తున్నారు. అలాగే నాకూ టైము వస్తుంది. నేనేంటో నిరూపించుకుంటాను. అయినా ప్రస్తుతానికి నేనేమీ ఖాళీగా వుండడం లేదు కదా! ఏదో ఓ సినిమాలో నటిస్తూనే ఉన్నాను' అని చిలకపలుకులు పలుకుతోంది.

